# భం

# గురువాణి

30 జూలై, 2026 సంచిక-264



## అల్ప విశ్వాసులు

గురువు పైన ఆ దైవం పైన అందరికీ ప్రగాఢమైన విశ్వాసం ఉండాలి. విశ్వాసాన్ని శ్వాసగా మార్చుకొని చూస్తే దానిఫలితం మీకు కనబడుతుంది. మీరంతా అల్ప విశ్వాసులు. సర్వ కాల సర్వావస్థల యందు ప్రభు మీ దయ, మీ కరుణ, మీ ఆశీర్వాదం మా పైన ఉంటే చాలు. లౌకిక విషయాలను మిమ్మల్ని అడగను, ఎప్పుడు ఎవరికి ఏమి చేయవలెనో అది మీకు తెలుసు, అనే భావముతో సద్గురువు పైన విశ్వాసం ఉంచాలి.

ఆవగింజ అంత విశ్వాసం గురువు పైన, దైవం పైన ఉంటే అద్భుతమైనటువంటి సంఘటనలు జరిగిపోతాయి అంటుంది వేదాంతం. మరి మీలో ఎంత మందికి ఇటువంటి విశ్వాసం ఉంది. గురువు పైన నమ్మకం లేకుంటే ఆధ్యాత్మిక క్షేత్రంలో రాణించ లేరు.

చూడండి కర్మ చాలా బలీయమైనది, దానిని అందరూ అనుభవించే తీరాలి. ఈ నగ్నసత్యాన్ని మీరందరూ అర్థం చేసుకోవాలి. మీ కర్మను తప్పనిసరిగా మీరు అనుభవించే తీరాలి. గురువు మీద ఆధారపడితే ఆ బాధ మీకు కనపడదు, కాళ్ళ క్రింద నీరులా ఆ బాధ కనపడకుండా వెళ్ళిపోతూ ఉంటుంది. కనుక శిష్య భక్తాదులరా మీరంతా గురు నామస్మరణ, గురుభక్తి అనే విశ్వాసాన్ని మీలో నింపుకోవాలి. అప్పుడు మీరంతా ఆధ్యాత్మిక క్షేత్రంలో ముందుకు రాణిస్తారు. మీరంతా మహాయోగులు అవుతారు.

పుట్టిన ప్రతి ఒక్కరికి యోగులు అయ్యే అర్హత, అవకాశం వుంది. దీని కొరకు మీరు చేయవలసిందల్లా గురువు పైన, ఆ భగవంతుడి పైన అచంచలమైన విశ్వాసం ఉంచి, సాధనతో మరియు గురు నామస్మరణతో ఆధ్యాత్మిక మార్గంలో రాణించగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.